

## కొండెపల్లిలో యువతి హత్య

**ప్రజాపక్షం/పెంచికలపేట్ :** మండలంలోని కొండెపల్లిలో ఆత్రం సమ్మక్క (25) అనే యువతి దారుణ హత్యకు గురైంది. సోమవారం అనుమానాస్పద స్థితిలో మృతి చెంది ఉన్న యువతిని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం సిర్పూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. హత్యకు గల కారణాలపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఈ ఘటనతో గ్రామంలో విషాదం నెలకొంది.

## పిచ్చికుక్క దాడిలో బాలుడికి గాయాలు





**ప్రజాపక్షం/జన్నారం :** గ్రామంలో కుక్కల సంచారం అధికమవడంతో ప్రజలు తీవ్ర భయాందోళనకు గురవుతున్నారు. లింగయ్యపల్లికి చెందిన యాదగిరి గోపాల్ కుమారుడు ఆదిత్యపై సోమవారం పిచ్చికుక్క అకస్మాత్తుగా దాడి చేసి గాయపరిచింది. బాలుని శరీరంలోని పలుచోట్ల తీవ్ర గాయాలు కావడంతో కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం బాలుని పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు తెలిపారు. అధికారులు స్పందించి కుక్కలను పట్టుకొని రక్షణ కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## ప్రజావాణి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలి : కలెక్టర్

**ప్రజాపక్షం/నిజామాబాద్ :** ప్రజాసమస్యల సత్వర పరిష్కారం కోసం ప్రతి సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమంనిర్వహించారు. సబ్‌కలెక్టర్లు వికాస్ మహతో,అభిగ్యాన్ మాల్వియా,ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ దిలీప్‌కుమార్, డీఆర్‌డీఓ సాయగౌడ్, ఆర్డీఓ రాజేంద్రకుమార్, బోధన్‌ఏసీపీ శ్రీనివాస్‌లతో కలిసి కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రజావాణి ఫిర్యాదులు స్వీకరించారు. 80 వినతులు అందగా వాటి పరిష్కారం కోసం సంబంధిత శాఖల అధికారులకు అందించారు. ఫిర్యాదుల పరిష్కారంలో జాప్యం చేయవద్దని సూచించారు. ప్రజావాణి కార్యక్రమం ప్రారంభమయ్యే నిర్ణీత సమయం ఉదయం 10.30 గంటలవరకు అధికారులందరూ హాజరై ఉండాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



## దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకం

కలెక్టర్ అభిలాష అభినవ్

**ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ :** దేశాభివృద్ధికి జనగణన అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు.భారత జనాభా గణన 2027కి సంబంధించి,కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ పాల్గొన్నారు.ముందుగా జ్యోతి ప్రజ్వలన గావించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ మాట్లాడుతూ,దేశాభివృద్ధిలో జనగణన ప్రక్రియ కీలక భూమిక పోషిస్తుందని అన్నారు.అధికారులు చేపట్టే జనగణన ఆధారంగానే ప్రభుత్వం ప్రజలకు అవసరమయ్యే పథకాల అమలు,మౌలిక సదుపాయాల కల్పన,ఇతర ప్రజా ప్రయోజనాల రూపకల్పనలో జనగణన ప్రక్రియ ఆధారం అని అన్నారు.దేశాభివృద్ధికి దిక్సూచిలా నిలిచే జనాభా గణ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా,పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర అధికారులను ఆదేశించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఆర్డీవో రత్న కళ్యాణి,సీపీఓ జీవరత్నం,డిపివో శ్రీనివాస్,జెడ్పీ సీఈవో శంకర్,ఇతర అధికారులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## గవర్నర్ ప్రసంగం పూర్తిగా డొల్ల,అబద్ధాల పుట్ట

చిత్తు కాగితంతో సమానం

మాజీ మంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/భీమ్‌గల్ :** తెలంగాణ అసెంబ్లీలో నేడు జరిగిన గవర్నర్ ప్రసంగంపై బాల్కొండ ఎమ్మెల్యే, మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి తీవ్రస్థాయిలో స్పందించారు. గవర్నర్ ప్రసంగం పూర్తిగా డొల్లగా, అబద్ధాలతో నిండిపోయిందని, ప్రజలకు ఉపయోగపడే స్కీంల కంటే స్కామ్‌లే ఎక్కువగా ఉన్నాయని విమర్శించారు. ఇది ప్రజలను మరోసారి మోసం చేసే ప్రయత్నమేనని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాసిచ్చిన స్క్రిప్ట్‌ను గవర్నర్ చదవటం తప్ప ఈ ప్రసంగంలో కొత్తదనం ఏమాత్రం కనిపించలేదన్నారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీగా ప్రకటించిన 6 గ్యారంటీలు, 420 హామీలు గవర్నర్ ప్రసంగంలో ఎక్కడా కనిపించకపోవటం ప్రజలను మోసం చేసినట్టేనని విమర్శించారు. ప్రతి మహిళకు నెలకు రూ.2500 ఆర్థిక సాయం ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైందని ప్రశ్నించారు. గత రెండేళ్ల కాంగ్రెస్ పాలనలో కొత్తగా ప్రారంభించిన అభివృద్ధి కార్యక్రమం ఒక్కటి కూడా లేదని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రారంభించిన పనులనే ఇప్పుడు ప్రారంభోత్సవాలు చేసుకుంటూ తమవిగా చెప్పుకుంటున్నారని ఎద్దేవా చేశారు. ప్రజలకిచ్చిన హామీల అమలు జరిగేవరకు బీఆర్ఎస్ పార్టీ అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తూ పోరాటం కొనసాగిస్తుందని స్పష్టం చేశారు.

# గ్యాస్ కొరత లేకుంటే క్యూలైన్లు ఎందుకు?

గ్యాస్ ఉందంటున్న అధికారులు ..

ఏజెన్సీల వద్ద బారులు తిరుతున్న ప్రజలు

జోరుగా బ్లాక్‌లో వంట గ్యాస్ అమ్మకాలు





**ప్రజాపక్షం/మెదక్ :** వంట గ్యాస్ కొరత లేకుంటే ఏజెన్సీల వద్ద క్యూలైన్లు ఎందుకు..? ఉంటున్నాయని వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేసున్నారు. మెదక్ జిల్లాలో వంటగ్యాస్ సిలిండర్ల కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులుపడుతున్నారు. గ్యాస్ సరఫరాలో ఎలాంటి కొరత లేదని అధికారులు చెబుతున్నప్పటికీ, స్థానిక గ్యాస్ ఏజెన్సీల వద్ద వినియోగదారులు బారులు తీరుతున్నారు. వాస్తవ పరిస్థితి మాత్రం పూర్తిగా భిన్నంగా కనిపిస్తోంది. పట్టణాల, గ్రామాల ప్రజలు స్థానిక గ్యాస్ ఏజెన్సీల వద్ద ఉదయం నుంచే భరీ క్యూలు కనిపిస్తున్నాయి. కొంత మంది వినియోగదారులు సిలిండర్ కోసం గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోంది. ముందస్తుగా బుకింగ్ చేసినప్పటికీ డెలివరీ రావడం లేదని ప్రజలు మండిపడుతున్నారు. "మెసేజ్ వస్తోంది.. కానీ సిలిండర్ మాత్రం రాదు" అని వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. చాలామంది మహిళలు చిన్న పిల్లలతో కలిసి ఏజెన్సీ వద్దే వేచి ఉండాల్సి వస్తోంది. సాధారణ ప్రజలకు సిలిండర్లు ఇవ్వకుండా, దళారులు ఎక్కువ ధరలకు బ్లాక్ మార్కెట్‌లో హోటల్స్, టిఫిన్ సెంటర్లలో విక్రయిస్తున్నారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ ఆరోపణలు నిజమైతే పరిస్థితి మరింత ఆందోళనకరమని ప్రజలు అంటున్నారు. ఏజెన్సీ వర్గాలు మాత్రం రవాణా సమస్యలు, స్టాక్ ఆలస్యం, డిమాండ్ పెరగడం వంటి కారణాల వల్ల సరఫరా ఆలస్యమవుతోందని చెబుతున్నారు. అధికారులు కూడా గ్యాస్ కొరత లేదని, పరిస్థితి త్వరలో సాధారణమవుతుందని అంటున్నారు. మెదక్ జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, అదనపు కలెక్టర్ నగేష్, ఇతర అధికారులు క్షేత్రస్థాయిలో గ్యాస్ గోదాంలల్లో నిల్వలను పరిశీలించి, గ్యాస్ కొరత లేదని తేల్చారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా గ్యాస్ సరఫరా చేయాలని సంబంధిత డీలర్లకు సూచించినప్పటికీ, ప్రజలకు గ్యాస్ కష్టాలు తీరడం లేదు. కలెక్టర్ ఆదేశాల మేరకు గ్యాస్ సమస్యల కోసం 9391942254 నెంబర్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. జిల్లాలో ఉన్న ఏజెన్సీల బుకింగ్ నెంబర్లకు ఫోన్ చేసిన గ్యాస్ సమస్యలు తీరడం లేదని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. "గ్యాస్ కొరత లేదంటే.. ఈ క్యూలు ఎందుకు?" అని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులకు అధికారులు తక్షణ పరిష్కారం చూపకపోతే పరిస్థితి మరింత ఉద్రిక్తంగా మారే అవకాశం ఉంది. త్వరగా వంట గ్యాస్ సమస్యను పరిష్కరించాలని జిల్లా ప్రజలు కోరుతున్నారు.

**బ్లాక్‌లో జోరుగా వంటగ్యాస్ అమ్మకాలు**

వంటగ్యాస్ కొరత తీవ్రంగా ఉండటంతో సిలిండర్లను కొందరు దళారులు బ్లాక్ మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దళారులు రూ.1500 నుంచి 2000వరకు సిలిండర్లను అమ్ముకొని సొమ్ముచేసుకుంటున్నట్లు తెలిసింది. ప్రభుత్వం నిర్ణయించిన ధర కంటే ఎక్కువ ధర తీసుకుని సిలిండర్లు అందిస్తున్నారని వినియోగదారులు చెబుతున్నారు. గ్యాస్ కొరత పేరుతో డీలర్లు స్టాక్ దాచిపెట్టి, రహస్యంగా బ్లాక్‌లో అమ్ముతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలు తీవ్రంగా ఇబ్బందులు పడుతుండగా, అధికారులు తనిఖీలు పెంచాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అక్రమంగా గ్యాస్ అమ్మకాలు కొనసాగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్, సంబంధిత శాఖ అధికారులు హెచ్చరించినప్పటికీ, పరిస్థితిలో పెద్ద మార్పుకనిపించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## గ్యాస్ ధరలు తగ్గించాలి

సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి

**ప్రజాపక్షం/బెల్లంపల్లి :** కేంద్ర ప్రభుత్వం పెంచిన గ్యాస్ ధరలను వెంటనే తగ్గించాలని సిపిఐ పట్టణ కార్యదర్శి ఆడెపు రాజమౌళి డిమాండ్ చేశారు. సోమవారం బెల్లంపల్లి కంట చౌరస్తా వద్ద పట్టణ సమితి ఆధ్వర్యంలో రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై యుద్ధం ఆపి ప్రపంచ శాంతిని కాపాడాలని కోరారు. ప్రధాని మోడీ అమెరికాకు దాసోహమై గ్యాస్ ధరలు పెంచుతూ సామాన్యులపై భారం మోపుతున్నారని విమర్శించారు. గ్యాస్ కొరత వల్ల హోటళ్లు మూతపడి కార్మికులు ఉపాధి కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు బొల్లం పూర్ణిమ, మల్లేష్, చిప్ప నరసయ్య, బొంతల లక్ష్మీనారాయణ, తిలక్ అంబేద్కర్, రత్నం రాజ్యం, చంద్రమాణిక్యం, రామచందర్, సోని, కళారాణి, స్వర్ణలత పాల్గొన్నారు.

# యుద్ధం సాకుతో గ్యాస్, పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచొద్దు

సామాన్య ప్రజలపై భారం మోపితే

ఎంత మాత్రం సహించం

గజ్వేల్ నియోజకవర్గ సిపిఐ కార్యదర్శి శివలింగ కృష్ణ



**ప్రజాపక్షం/గజ్వేల్ :** యుద్ధం పేరుతో గ్యాస్, పెట్రో ఉత్పత్తుల ధరలు పెంచొద్దని సిపిఐ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ కార్యదర్శి శివలింగ కృష్ణ పేర్కొన్నారు. సోమవారం భారత కమ్యూనిస్టు పార్టీ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గజ్వేల్ అంబేద్కర్ చౌరస్తా వద్ద పార్టీ శ్రేణులతో కలిసి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలకు పాల్పడుతూ లేబర్ కోడ్లను తెచ్చినట్లు విమర్శించారు. అలాగే యుద్ధం సాకుతో గ్యాస్ ధర పెంచొద్దని, అలాగే సామాన్య ప్రజలకు గ్యాస్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేశారు. సిపిఐ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యులు స్వర్గం రాజేశం మాట్లాడుతూ అమెరికా సామ్రాజ్యవాద చర్యలకు వ్యతిరేకంగా, అలాగే ఇరాన్ పై ఆదిపత్యం కోసం చేస్తున్న యుద్ధాన్ని వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. యుద్ధ చర్యలతో ప్రపంచ శాంతికి భంంగ కలుగుతుందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ఐక్యరాజ్యసమితి చర్యలు చేపట్టాలని కోరారు. అమెరికా మద్దతుతో ఇజ్రాయిల్ దేంశ ఇరాన్ పై దాడులు చేస్తుండడంతో అత్యంత విలువైన ఆయిల్ నిల్వలు ధ్వంసమై ఉత్పత్తికి తీవ్ర నష్టం కలుగుతుందని చెప్పారు. ఆయిల్ నిక్షేపాలు గలిగిన ఇరాన్ ను ఆక్రమించు కోవడమే లక్ష్యంగా అమెరికా ఈ దాడులు ప్రోత్సహిస్తుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనిని సిపిఐ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. యుద్ధ ముప్పు ముంచుకొస్తుండడంతో దేశంలో ఆయిల్ కొరత ఏర్పడి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని హెచ్చరించారు. కాగా ఇప్పటికే గృహ అవసరాలకు గ్యాస్ అందిస్తామని, వాణిజ్య, వ్యాపార, పరిశ్రమల నిర్వహణకు గ్యాస్ ఇవ్వలేమని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పేర్కొంటుండడంతో భయాందోళనలు నెలకొన్నట్లు స్పష్టం చేశారు. అయితే వెంటనే ప్రధాని నరేంద్ర మోడీ అమెరికా పై ఒత్తిడి తెచ్చి యుద్ధ నిలుపుదలకు ప్రయత్నించాలని డిమాండ్ చేశారు. దేశంలో గ్యాస్ కొరతను ఎదుర్కోవడానికి తగు చర్యలు తీసుకోవాలని కోరుతూ రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ పార్టీ ధర్నాలు చేపట్టినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పార్టీ మండల సహాయ కార్యదర్శి మొట్ట శ్రీను గజ్వేల్ భవన నిర్మాణ కార్మిక సంఘం అధ్యక్షుడు చంద్రం, నేతలు శ్రీనివాస్, పోతుల శంకరయ్య, నర్సింలు, రాజు, విజయ్ తదితరులు పాల్గొన్నారు.

## మోదీ సర్కార్ మాటలు ఖాళీ సిలిండర్‌లను నింపగలవా?

సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తాజోద్దీన్

**ప్రజాపక్షం/సదాశివపేట :** మోదీ సర్కార్ మాటలు ఖాళీ సిలిండర్‌లను నింపగలవా అని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తాజోద్దీన్ ప్రశ్నించారు. వంట గ్యాస్ కొరతతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, గ్యాస్ ఏజన్సీలు, బ్లాక్ దందాలకు తెగబడ్డారని సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అన్నారు. ఆదివారం సదాశివపేటలో సిపిఐ ఆధ్వర్యంలో వంట గ్యాస్ బ్లాక్ మార్కెట్‌పై అధిక రేట్లకు సిలిండర్‌లను అమ్ముతున్న ఏజెన్సీ సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ఆందోళన చేశారు. ఈ సందర్భంగా సిపిఐ జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు తాజోద్దీన్ మాట్లాడుతూ మోదీ సర్కార్‌కు దూరదృష్టి లేకుండా దేశ ప్రతిష్టను ఆమెరికాకు తాకట్టు పెట్టారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు షఫి ఆహ్మద్, పాండు, శంకరప్ప, ముస్తాఫా, సాదిక్ అలీ బిపాషా గౌస్, దేవి తదితరులున్నారు.





## ప్రజావాణి దరఖాస్తులు త్వరగా పరిష్కరించాలి

**ప్రజాపక్షం/ఉట్నూర్ :** ప్రతీ సోమవారం ప్రజావాణి కార్యక్రమంలో అందిన దరఖాస్తులపై క్షేత్రస్థాయిలో పరిశీలించి త్వరగా పరిష్కరించే విధంగా అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్త ప్రాజెక్ట్ అధికారి యువరాజ్ మార్మాట్ అన్నారు. సోమవారం కార్యాలయం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఉట్నూర్ మండలం ఘనపూర్ గ్రామానికి చెందిన ఆత్రం లోకేష్ తనకి పై చదువుల నిమిత్తం ల్యాప్‌టాప్ మంజూరు కల్పించామని, సిర్పూర్(యు) మండలం సిర్పూర్ గ్రామానికి చెందిన గేడం గజానంద్ తనికి ఏకలవ్య పాఠశాలలో స్లీపర్ ఉద్యోగం కొరకు కోరారు. సిరికొండ గ్రామానికి చెందిన రామారావు తనికి సోలార్ పంపు సేంట్ మంజూరు కొరకు అర్జీ కోరారు. వివిధ ప్రాంతాల నుండి వచ్చిన ప్రజలు పింఛన ప్రజలు ఫింఛన్, ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, స్వయం ఉపాధి పథకాల మంజూరు, వ్యవసాయ, రెవెన్యూ శాఖలకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని దరఖాస్తులు అందజేశారు.




## పశువుల ఆరోగ్య సంరక్షణతోనే రైతులకు ఆర్థిక భరోసా

హరిత, జిల్లా కలెక్టర్

**ప్రజాపక్షం/వాంకిడి :** పశువుల ఆరోగ్య సంరక్షణ రైతుల ఆర్థిక స్థితిని బలోపేతం చేయడంలో కీలక పాత్ర పోషిస్తుందని జిల్లా కలెక్టర్ హరిత పేర్కొన్నారు. సోమవారం వాంకిడి మండలంలోని బంబరా గ్రామంలో సంపూర్ణత అభియాన్ 2.0 కార్యక్రమంలో భాగంగా పశువులకు ఉచిత గాలికుంట వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేపడుతున్న ఇటువంటి కార్యక్రమాల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో పశుసంవర్ధక రంగానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. గాలికుంట వ్యాధి వల్ల రైతులకు పెద్ద ఎత్తున ఆర్థిక నష్టం కలిగే అవకాశం ఉన్నందున, పశువులను రక్షించుకోవడానికి క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. గ్రామంలోని రైతులు తమ ఆవులు, ఎద్దులు, గేదెలను శిబిరానికి తీసుకువచ్చి టీకాలు వేయించుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న పశుసంవర్ధక సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ప్రతినిధి అశ్న శర్మ, డిడిటిడబ్ల్యూ రమాదేవి, జిల్లా వెటర్నరీ అధికారి డాక్టర్ సురేష్ కుమార్, పశువైద్యాధికారి డాక్టర్ జి. శరణ్య, సర్పంచ్ బెండరే కృష్ణజీ, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# భగీరథ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలి

ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్





**ప్రజాపక్షం/కాగజ్‌నగర్ :** మిషన్ భగీరథ కార్మికులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల వేతనాలను వెంటనే చెల్లించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు. సోమవారం కాగజ్ నగర్ సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఎఒ వరలక్ష్మికి ఎఐటియుసి ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వేతనాలు అందక కార్మికులు కుటుంబాలను పోషించుకోలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ప్రతి నెలా ఒకటో తేదీనే గ్రీన్ ఛానల్ ద్వారా ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. కనీస వేతనం రూ.26వేలు అందించాలని, సమాన పనికి సమాన వేతనం అమలు చేస్తూ కాంట్రాక్ట్ వ్యవస్థను రద్దు చేసి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 8 గంటల పని విధానం అమలు చేయాలని, పెట్రోల్ అలవెన్స్, మొబైల్ బిల్లులను కంపెనీయే భరించాలని, జాతీయ పండుగలకు వేతనంతో కూడిన సెలవులు ఇవ్వాలని, ఇపిఎఫ్, ఇఎస్ఐ వివరాలను కార్మికులకు తెలియజేయాలని అన్నారు. మిషన్ భగీరథ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి షకీర్, వర్కింగ్ ప్రెసిడెంట్ జంషద్, కార్మికులు సామల శివ, విజయ్ పాల్గొన్నారు.

**సిఆర్‌పిలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి**

**ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్**

కాంప్లెక్స్ రిసోర్స్ పర్సన్లను (సిఆర్‌పి) ఎలాంటి షరతులు లేకుండా ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్ డిమాండ్ చేశారు.

సోమవారం కాగజ్ నగర్ నాయబ్ తహశీల్దార్ పి.సరితకు ఎఐటియుసి అనుబంధ సిఆర్‌పి యూనియన్ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 13 ఏళ్లుగా బడి బయట పిల్లలను పాఠశాలల్లో చేర్పిస్తూ విద్యాభివృద్ధికి కృషి చేస్తున్న సిఆర్‌పిలను రెగ్యులరైజ్ చేస్తామని ఎన్నికల సమయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని కోరారు. అర్హత ఉన్నప్పటికీ కనీస వేతనం అందక సిఆర్‌పిలు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విధి నిర్వహణలో పాఠశాలల సందర్శన కోసం ప్రయాణ ఖర్చులు కూడా సొంతంగా భరిస్తున్నారని తెలిపారు. సిఆర్‌పిలకు టైమ్ స్కేల్ అమలు చేయాలని, పిఎఫ్, ఆరోగ్య బీమా సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేశారు. ఏటా టర్మినేషన్ విధానాన్ని రద్దు చేయాలని, ఉపాధ్యాయ నియామకాల్లో 30 శాతం వెయిటేజీ కల్పించాలని, అలాగే అంతర్ జిల్లా బదిలీలకు అవకాశం కల్పించి, రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద రూ.20 లక్షలు ప్రకటించాలని డిమాండ్ చేశారు.

కార్యక్రమంలో యూనియన్ నాయకులు మహేశ్వర్, రాజేశం, సిఆర్‌పిలు పాల్గొన్నారు.



## ఈ వారం ప్రజావాణికి 57వినతులు

స్థానిక సంస్థల ఇన్‌చార్జీ అదనపు కలెక్టర్ పాండు

**ప్రజాపక్షం/సంగారెడ్డి :** ఈ వారం ప్రజావాణికి 57 వినతులు అందాయని అధికారులు తెలిపారు. ప్రజావాణిలో వచ్చిన పిర్యాదులకు తక్షణ చర్యలు తీసుకోవాలని ,ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం చూపడమే ప్రజావాణి కార్యక్రమం ప్రదాన లక్ష్యమని స్థానిక సంస్థల ఇంచార్జీ అదనపు కలెక్టర్ పాండు అధికారులను ఆదేశించారు. సోమవారం సంగారెడ్డి కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి నలుమూలల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై తమ సమస్యలను అదికారుల దృష్టికి తీసుకువచ్చారు.

ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ పాండు మాట్లాడుతూ ప్రజల నుండి ప్రజావాణి కార్యక్రమంలో వచ్చే ఆర్జీలు ,పిర్యాదులు,వినతులు ఆలస్యం చేయకుండా త్వరిత గతిన పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. ప్రజావాణి కార్యక్రమంలో మెత్తం 57 ఆర్జీలు అందినట్లు అధికారులు తెలిపారు. అందిన ప్రతి వినతిని నమోదు చేసి సంబందిత శాఖలకు పంపించామని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఆర్థం చేసుకుని వాటికి తక్షణమే పరిష్కారం చూపాలని అధికారులకు అదనపు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు రెవెన్యూ డివిజనల్ అధికారులు కలెక్టరేట్ సెక్షన్ అధికారులు ప్రజలు సిబ్బంది పాల్గొన్నారు.



## నిర్వాసితులను ఆదుకుంటాం

జిల్లా కలెక్టర్ హైమావతి

**ప్రజాపక్షం/గజ్వేల్ :** రీజనల్ రింగ్ రోడ్ నిర్మాణంలో భూమిని కోల్పోతున్న బాధిత రైతులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని, అయితే భూ సేకరణకు రైతులు సహకరించాలని జిల్లా కలెక్టర్ కె హైమావతి తెలిపారు. సోమవారం గజ్వేల్ సమీకృత కార్యాలయ సముదాంయలో రీజనల్ రింగ్ రోడ్డు వలన భూమి కోల్పోతున్న చెబర్తి, అల్లాజీపేట, పిర్లపల్లి, ఇటిక్యాల గ్రామాల రైతులతో ఆర్బిటరేషన్ ప్రక్రియ గూర్చి జిల్లా కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హైమావతి మాట్లాడుతూ జిల్లాలోని గజ్వేల్ నియోజకవర్గం గుండా రీజనల్ రింగ్ రోడ్డు వెళ్తున్నందున ఈ ప్రాంత అభివృద్ధి కోసం భూమిని ఇవ్వడానికి రైతులు ఒప్పుకోవడం శుభపరిణామమని అన్నారు. ప్రజావసరాల కోసం భూమిని త్యాగం చేస్తున్న మీకు ప్రభుత్వ తరపున దక్కాల్సిన నష్టపరిహారం త్వరగా అందేలా చూస్తామని, భూమిని త్వరగా అందించేందుకు రైతులు ముందుకు రావాలని సూచించారు. ప్రభుత్వ నియమావళి ప్రకారం అందరికీ ఆమోద యోగ్యమైన పరిహారం అందిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ చంద్రకళ, తహసిల్దార్ నిర్మల తదితరులు పాల్గొన్నారు.

